నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 22 డిసెంబర్ 2023 | ADILABAD



ఇథనాల్ పరిశ్రమ నిలిపివేసేందుకు లోలం గ్రామస్తుల మద్దతుకోరుతున్న యువకులు

# మద్దతివ్వండి..

- ఇథనాల్ పరిశ్రమను కట్టకుండా చేద్దాం..
- న్యూలోలం గ్రామస్తులను కలిసిన యువకులు
- నష్టాలను వివరిస్తూ గ్రామంలో విస్తృత ప్రచారం

దిలావర్‌పూర్, డిసెంబర్ 21 ః నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను నిలిపివేసేందుకు కొందరు యువకులు మద్దతు కోరుతున్నారు. దిలావర్‌పూర్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం న్యూ లోలం గ్రామయువకులను కలిసి మద్దతు కోరారు. అనంతరం గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ వల్ల నష్టాలను గ్రామస్తులకు వివరించారు. పంటలు, వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఇటువంటి పరిశ్రమలను చిత్తానూర్‌లో ఏర్పాటు చేశారని, అక్కడి ప్రజల బాధలు వర్ణణాతీతం అని పేర్కొన్నారు. మీరు కూడా పరిశ్రమ ఏర్పాటును నిలిపివేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇథనాల్ పరిశ్రమ నిలిపివేత జేఏసీ నాయకులు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

## కేసులు పెండింగ్‌లో ఉంటే నష్టాన్ని తెలుపండి..


- ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్

ఎదులాపురం, డిసెంబర్ 21 : జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులను బలవంత పెట్టి కేసులు పరిష్కరించ వద్దని, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉంటే వాటి వల్ల ఇరువురికి జరిగే నష్టాన్ని తెలియజేయాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి ముందుస్తుగా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. అమెరికాలోని కోర్టులలో పది శాతం కేసులు కోర్టుల్లో పరిష్కారం అవుతాయని.. బయట 90 శాతం కేసులు పరిష్కారం అవుతున్నాయని గుర్తు చేశారు. కేసులు పెండింగ్‌లో ఉండడంతో కక్షిదారుల సమయం వృథా అవుతున్నదన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు డాక్టర్ శివరాంప్రసాద్, ప్రమీలా జైన్, మంజుల, డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి క్షమదేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, పీపీ సంజయ్ వైరగ్రె పాల్గొన్నారు.

# కరోనా వణుకు



ఒక వైపు చలి పంజా..
మరో వైపు కోవిడ్ భయం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు
- చలిలో కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

చలి@6.6



మంచిర్యాల పట్టణంలో చలి నుంచి ఉపశమనం కోసం మంట కాగుతున్న జనం

మంచిర్యాల, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం, సాయంత్రం వీస్తున్న చలిగాలులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా మంచు కురుస్తుండగా.. సాయంత్రం 7 గంటల తరువాత బయటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మారిన వాతావరణంతో చాలా మంది జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా వ్యాప్తి చెందుతుందంటూ వస్తున్న వార్తలు జనంలో వణుకు పుట్టిస్తున్నాయి. ఉత్తర తీరం నుంచి బలమైన గాలుల కారణంగా నాలుగైదు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ నెల మొదటి వారం నుంచే చలి వణికిస్తున్నది. ఇప్పటికే ప్రైవేటు, ప్రభుత్వ దవాఖానలు దగ్గు, జలుబు, జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. పిల్లల దవాఖానల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇలాంటి వాతావరణంలో వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా భయటికి రావొద్దని, అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలంటున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చని చెప్తున్నారు.

### చలిలో వేగంగా వ్యాప్తి..
### ప్రతి పీహెచ్‌సీలో పరీక్షలు..

ఇప్పుడు వస్తున్న కరోనా వేరియంట్ జేఎన్-1. ఇది చలి వాతావరణంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నదని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే తొమ్మిది కేసులు నమోదవడంతో దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్న వారిలో ఆందోళన పెరిగింది. ప్రస్తుతానికి భయపడేంత పరిస్థితి ఏం లేదని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. మరోవైపు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. లక్షణాలున్న వారు పీహెచ్‌సీకి వస్తే నిర్ధారణ పరీక్షలు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలో రోజూ కనీసం పది పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ వేరియంట్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుండడంతో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పదేండ్లలోపు, 60 ఏండ్లు దాటిన వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవాలని చెబుతున్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ ప్రభుత్వ దవాఖానల్లో ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. 50, 100 బెడ్స్ గల ఆసుపత్రులు ఉన్న దగ్గర కూడా కరోనా టెస్టులు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలని చెప్తున్నారు.

### పడిపోతున్న ఉష్ణోగ్రత్తలు

జేఎన్-1 చలిలో వేగంగా వ్యాపించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెప్తున్నారు. రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు మన జిల్లాలో నమోదవున్న దృష్ట్యా అలర్ట్‌గా వ్యవహరించాలని సూచిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యూ)లో బుధవారం 10.4 కనిష్ఠ ఉష్ణోగ్రత ఉంటే.. గురువారం 6.6 డిగ్రీలకు పడిపోయింది. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలో గురువారం 7.5 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలోనే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడం గమనార్హం. నిర్మల్ జిల్లాలోని పెంబి మండలంలో 8.7 డిగ్రీలు, మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మం డలంలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల వరకూ పొగమంచు కప్పి ఉంటున్నది. ఈదురు గాలులు వీస్తుండడంతో జనం బయటికి రావాలంటే వణికిపోతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే వాతావరణం చల్లగా మారిపోతున్నది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు తీవ్రమైన ఎండ ఉన్నా.. వాతావరణం చల్లగా ఉంటున్నది. ఫలితంగా వివిధ పనులపై బయటికి వెళ్లిన ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, గొంతు సంబంధిత సమస్యలతో సతమతం అవుతున్నారు.

### అడ్డుకట్టకు ముందస్తు చర్యలు



జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లను అలర్ట్ చేశాం. ప్రతి పీహెచ్‌సీలో రోజుకు పది మందికి పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేశాం. మంచిర్యాల గవర్నమెంట్ ఆసుపత్రిలో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎవ్వరు వచ్చినా టెస్టులు చేయాలని చెప్పాం. భయపడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత దూరం, మాస్క్ ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం చేస్తే మంచింది. అవసరమైతే బయటికి వెళ్లొద్దు. మాస్క్ ధరించకపోతే జరిమాన విధించాలనే ఆదేశాలు ఉన్నాయి. **- సుబ్బారాయుడు, డీఎంహెచ్‌వో, మంచిర్యాల**

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

తానూర్, డిసెంబర్ 21 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోరిగాం గ్రామంలో హనుమాన్ జాతరను పురస్కరించుకుని గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహారాష్ట్ర, హర్యాన రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.7,051 గ్రామస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతరెడ్డి, మాజీ ఎంపీపీలు బాషెట్టి రాజన్న, బాలేరావ్ లాలు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ యాదవ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు గోవింద్ పటేల్ పాల్గొన్నారు.



బోరిగాంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

## సమీకృత వ్యవసాయ క్షేత్రం సందర్శన

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ఆశిష్ పరిశీలన
- నిర్మల్ పట్టణంలోని సోఫినగర్‌లో గల విజయ డెయిరీ కూడా సందర్శన



సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సోన్, డిసెంబర్ 21 ః నిర్మల్ మండలంలోని కొండాపూర్ సమీపంలో గల సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఇందులో సేంద్రియ విధానాన్ని, కొరమీను చేపలు, నాటు కోళ్ల పెంపకాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్క్యులేటరీ అక్వాకల్చర్ విధానాన్ని వ్యవసాయ రైతుల కోసం రూపొందించబడిందని.. 15 వేల లీటర్ల సామర్థ్యం గల వృత్తాకార టాంక్‌లో ఆక్సిజన్ సరఫరా కొరకు రింగ్ బ్లోవర్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. చేపల పెంపకం భూగర్భజలాల ఆధారిత సాగు కనుక భూగర్భ జలాలను చేపల పెంపకానికి వాడిన తర్వాత నైట్రోజన్, అమోనియా శాతం కలిగిన నీటిని సేంద్రియ ఎరువులతో సమానమని, ఈ నీటిని కూరగాయలు, వరి సాగుకు ఉపయోగించవచ్చని తెలిపారు. ఫలితంగా యూరియా తక్కువ మోతాదులో అవసరం అవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయ లక్ష్మి, అదనపు డీఆర్‌డీవో గోవింద్ పాల్గొన్నారు.

### పాల సేకరణ పెంచాలి..

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 21 : సామర్థ్యానికి అనుగుణంగా పాల సేకరణ పెంచాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని సోఫినగర్‌లో గల విజయ డెయిరీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాల సేకరణ పరిశ్రమ వివరాలను ఉప సంచాలకులు మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా గిరిజన సభ్యులతో లవణ మిశ్రమం తయారీ, పాల ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరి విజయమిన్ లవణ మిశ్రమం విక్రయాలు పెంచాలని.. పాడి రైతులకు దాణ, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ దస్రునాయక్, రమణారెడ్డి, సాయన్న, సంతోష్, రమ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



### కేసీఆర్ సర్కారే మంచిగుండే..

*యాసంగి సీజన్ ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సాయం అందించడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండు సీజన్‌లకు ముందుగానే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. దీంతో అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సకాలంలో పంటలు వేసుకునే వాళ్లం. దీంతో దిగుబడులు బాగా వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు వేయకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.*
**- వెంకట్‌రెడ్డి, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం**

# రైతుబంధొస్తలేదు..

## పంట పెట్టుబడి డబ్బుల కోసం రైతన్నల నిరీక్షణ

- యాసంగి ప్రారంభమై 45 రోజులైనా పడని పైసలు
- ఆదిలాబాద్ జిల్లాలో రూ.286 కోట్లకు రూ.3 కోట్లే వచ్చినయ్..
- సాయం కోసం 1,56,067 మంది కర్షకుల ఎదురు చూపు
- వడ్డీ వ్యాపారులు, షావుకార్ల చుట్టూ ప్రదక్షిణలు
- కేసీఆర్ సర్కారే మంచిగుండే అంటున్న రైతన్నలు

ఆదిలాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) ః యాసంగి రైతుబంధు సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసింది. వానకాలం, యాసంగికి ఒక్కో పంటకు ఎకరాకు రూ.5 వేల చొప్పున యేడాదికి రెండు పంటలకు రూ.10 వేలు అందించింది. సీజన్‌కు ముందుగానే డబ్బులు ఖాతాల్లో జమ చేసేది. మొదటి రోజు ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు రూ. 5 వేలు.. తర్వాత రెండు, మూడు ఎకరాలు ఉన్న వారికి డబ్బులు ఇచ్చింది. ఇలా పక్షం రోజుల్లో పెట్టుబడి సాయం అందరి ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో ముందుగానే తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేవారు. ఇలా కేసీఆర్ ప్రభుత్వ సాయంతో పెట్టుబడికి ఢోకా లేకుండా కర్షకులు వ్యవసాయం చేశారు.

### సాయం కోసం నిరీక్షణ

ఆదిలాబాద్ జిల్లాలో 1,64,124 మంది రైతులు రైతుబంధు సాయానికి అర్హులుగా ఉన్నారు. వీరికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.286 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. వానకాలానికి సంబంధించిన డబ్బులను కేసీఆర్ ప్రభుత్వం రైతులందరికీ అందించింది. ఇంతలోనే గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల హామీలో భాగంగా యాసంగి సీజన్‌కు రైతుబంధు సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. డబ్బుల కోసం అన్నదాతలు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు వారం రోజుల నుంచి ఎకరం లోపు కేవలం 35 గుంటలు భూమి ఉన్న 10,056 మంది రైతులకు రూ.3 కోట్ల సాయం అందింది. ఇంకా మిగిలిన 1,56,067 మంది రైతులకు రూ.283 కోట్ల డబ్బులు రావాల్సి ఉంది. ప్రస్తుతం డబ్బులు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుకు అయ్యే ఖర్చుకు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

### కాంగ్రెసోళ్లు పైసలేస్తలేరు..



*వానకాలానికి సంబంధించి అకాల వర్షాలతో పంట దిగుబడి తక్కువగా ఉంది. రైతులకు పెట్టుబడి సాయం చాలా అవసరం. ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం పంపిణీ చేయాలి.*
**- సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్**



నృత్యం చేస్తున్న విద్యార్థినులు..

# యువజనోత్సాహం

- ఆదిలాబాద్ సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు
- జ్యోతి ప్రజ్వళన చేసిన ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్





నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జానార్దన్

ఎదులాపురం, డిసెంబర్ 21 : ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో గురువారం యువజనోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ట్రెయినీ సహాయ కలెక్టర్ వికాస్ మోహతోలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జానపద గీతాలకు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. యువత తమ నైపుణ్యాలకు పదును పెట్టి ఆసక్తి గల రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వామి వివేకానంద చూపిన మార్గంలో యువత పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తాంసి జడ్పీటీసీ రాజు, యువకులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమిపై ఆగ్రహం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 21 ః ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వినాయక చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్‌పై రాజ్యసభలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును ఖండిస్తూ నల్ల కండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఉభయ సభలను అవమాన పరిచే విధంగా ఇండియా కూటమి ఎంపీ సభ్యులు ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఆదినాథ్, నాయకులు పాల్గొన్నారు.



వినాయక చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

## సింగరేణి గుర్తింపు ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : సింగరేణి గుర్తింపు ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ప్రతిష్టంభన వీడింది. ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలను యధాతథంగా నిర్వహించాలని గురువారం రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆర్‌ఎల్సీని, యాజమాన్యాన్ని ఆదేశించింది. కొద్ది రోజుల నుంచి గుర్తింపు ఎన్నికల వాయిదాపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకుల్లో ప్రతిష్టంభన నెలకొంది. గురువారం హైకోర్టు ఇచ్చిన తీర్పుతో సందిగ్ధతకు తెరపడింది. ఇక కార్మిక సంఘాలు ప్రచారం ముమ్మరం చేయనున్నాయి.